ఓన్లీ గోల్డ్ అండ్ క్యాష్..!

- వెండి, ఇతర వస్తువులు ముట్టని దొంగలు
- రెండుచోరీలు ఒకే ముఠా పనిగా అనుమానం
- వరుస దొంగతనాలపై మంథని ప్రజల్లో ఆందోళన


సామగ్రి చిందరవందర చేసిన దొంగలు

మంథని: మంథనిలో వరుస దొంగతనాలు స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఆదివారం ఒకే ఇంట్లో మూడు గదుల్లో దొంగతనాలకు పాల్పడిన దొంగలు.. సోమవారం కూరగాయల మార్కెట్ ఏరియాలో శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో చొరబడి చేతివాటం ప్రదర్శించారు. అయితే ఈ దొంగతనాల్లో బంగారం, నగదును ఎత్తికెళ్లిన దొంగలు.. వెండితోపాటు ఇతర వస్తువులను మాత్రం అపహరించకపోవడం గమనార్హం. ఓ ఇంట్లో సుమారు రెండు కిలోల వెండి వస్తువులు ఉన్నప్పటికీ వాటిని దొంగలు ముట్టుకోలేదు. అదే సమయంలో యూరప్, ఇండియన్ కరెన్సీతోపాటు పలు బ్యాంకుల్లో ఫిక్స్ చేసి దాచిపెట్టిన బాండ్ పేపర్లను అపహరించారు.

ఒకే తరహా చోరీలు

తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసిన దొంగలు.. ఒకే తరహాలో చోరీలకు పాల్పడ్డారు. ఇంటి తాళాలు ముట్టుకోకుండా గడియను మాత్రమే కట్ చేసి తలుపులు తెరిచి చోరీకి పాల్పడ్డారు. బీరువాలు, ఇతరత్రా లాకర్లను తొలగించారు.

క్లూస్‌టీం, ఫింగర్ ప్రింట్స్ సేకరణ

దొంగతనాలు జరిగిన పట్టణంలోని గౌడ్ వీధిలోని ఇందిరమ్మ ఇంట్లో ఆదివారం రాత్రి, మార్కెట్ ఏరియాలోని శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సోమవారం పోలీసులు పరిశీలించారు. క్లూస్‌టీం, ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. దొంగలను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు నియమించినట్లు మంథని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అనుమానితులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. మంథనిలో ఇలా వరుస దొంగతనాలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారగా.. ప్రజల్లో ఆందోళన కల్గిస్తున్నాయి. ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే జనం జంకే పరిస్థితులు నెలకొన్నాయి.


తలుపు గడియను కట్ చేసిన దొంగలు

అధికారుల పనితీరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ

ధర్మారం: మన ఊరు మనబడిలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులలో ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, బిల్లులు చేయటం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారుల పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ డీఈఈ, ఏఈలను సస్పెండ్ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మన ఊరు మనబడిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించటం లేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని, చేసిన పనులకు బిల్లులు చేయటం లేదని సభ్యులు ముత్యాల బలరాంరెడ్డి, పుస్కూరి జితెందర్‌రావు ఆరోపించారు. మన ఊరు మన బడికి సంబంధించిన పనులు చేయించటం లేదని కనీసం పనులు చేపట్టిన వారికి సహకరించటం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకారసంఘాల ఫోరం జిల్లా చైర్మన్ బలరాంరెడ్డి, మార్కెట్ చైర్మన్ బుచ్చిరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ సలామోద్దీన్, సింగిల్ విండో చైర్మన్ వెంకటరెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ స్వప్న

ధర్మారం: మహిళలు తగిన పౌష్టికాహారం తీసుకుంటే శారీరక సమస్యలకు దూరంగా ఉంటారని సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ దారవేని స్వప్న అన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం తులసీ మాత ఆధ్వర్యంలో సహాయ స్వచ్ఛంద సంస్థ వారు మహిళల కోసం మోనోపాజ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ 40 నుంచి 58 ఏళ్ల మహిళల శారీరక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి కావల్సిన న్యూట్రిషన్ ఫుడ్, చిన్న చిన్న వ్యాయామం గురించి వివరించారు. రుతుక్రమంకు సంబంధించిన సమస్యలుంటే స్థానిక పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు అపర్ణ, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీల ఐక్యతను చాటుదాం


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న జెడ్పీటీసీ

పెద్దపల్లిరూరల్: బీసీలంతా ఐక్యంగా ఉండి పోరాడాల్సిన అవసరముందని ఓదెల జెడ్పీటీసీ గంట రాములు అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో 12 రోజులుగా చేపట్టిన రిలే దీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష తో కలిసి మాట్లాడారు. బీసీగణన చేపట్టాలని, జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లు 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ కోటి సంతకాల కార్యక్రమాన్ని బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని దాసరి ఉష తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, రియాజ్, అరుణ, అఖిల, సాధిక్, అజీం, శ్రీధర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

ఎలిగేడు: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు లాభాల బాటలో పయనిస్తారని ఏడీఏ కాంతారావు,ఏవో ఉమాపతి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని నర్సాపూర్‌లో ఏడీఏ ఏవో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో ఉమాపతి, ఏఈవోలు పద్మ, గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన మహిళలు, నాయకులు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో సోమవారం పలువురు మహిళలు, నాయకులు తెలంగాణ వైఎస్సార్‌టీపీ పార్టీలోచేరారు. పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మ రాజయ్య ఆధ్వర్యంలో నియోజక వర్గ ఇన్‌చార్జి ఎద్దు లక్ష్మణ్ సమక్షంలో యాభై మంది చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మహేశుల రాములు, మహిళా అధ్యక్షురాలు అట్ల లక్ష్మి, శారద, జెట్టి సంపత్, మొగురం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణపనులు ప్రారంభం


సీసీరోడ్ల పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

రామగిరి: మండలంలోని ఇప్పలపల్లి పంచాయతీ పరిధి రామకృష్ణాపూర్‌లో రూ. 14లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ జక్కులు సత్తయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు చొరవతో ముత్తారం మండలంలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టిందన్నారు. పుట్ట మధు సహకారంతో దాదాపు అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మాణం పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పు సుగుణ, నాయకులు ఉప్పు శ్రీనివాస్, దండె ఓదెలు, రాయమల్లు పాల్గొన్నారు.

శివాలయంలో రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని పాత శివాలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. సోమవారం ఐతు వెంకటేశ్వర్లు – స్వప్న దంపతులు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేశారు. హాజరైన భక్తులు పూజారులు మహేశ్, రమేశ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, కొమురవెల్లి అంజయ్య, వసంత, వాసాల శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నిరంతర విద్యుత్ ఇవ్వాలి



ఎలిగేడు, ఓదెలలో సబ్‌స్టేషన్ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలపల్లి/ ఎలిగేడు/ కాల్వశ్రీరాంపూర్/ ఓదెల: రైతులకు నిరంతరంగా విద్యుత్ ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్లు ముట్టడించి నిరసన చేపట్టి ఆయా మండలాల విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ప్రభుత్వం ప్రకటించినట్లుగా 24 గంటల కరెంట్ ఉత్తమాటలేనని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నిరసనల్లో జూలపల్లి మండల నాయకులు మెతుకు కాంతయ్య, మానుమండ్ల శ్రీనివాస్, ఎలిగేడు మండల నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, సుల్తాన్‌పూర్ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎలిగేడు ఉప సర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, కాల్వశ్రీరాంపూర్ మండల కన్వీనర్ మునీర్, పెద్దరాతుపల్లి సర్పంచ్ ఓరుగంటి కొమురయ్య, కాంగ్రెస్‌పార్టీ ఓదెల మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి సర్పంచ్ అంకం రమేశ్, ఉపసర్పంచ్ నిమ్మనాయక్, అంబాల కొంరయ్య, తదితరులు పాల్గొన్నారు.

హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో విజయరమణా రావు


యాత్రలో రేవంత్‌రెడ్డితో విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం మొదలైన హాథ్‌సేహాథ్ జోడో యాత్రలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు పాల్గొన్నారు. అంతకుముందు ములుగులో గట్టమ్మ ఆలయం, మేడారం సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు.

టీపీసీసీ ఇన్‌చార్జిని కలిసిన మహేశ్

రామగుండం: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రేను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితులను వివరించినట్లు మహేశ్ పేర్కొన్నారు.

మంథని కళాకారుడికి నంది అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న, సంతోష్‌కుమార్

మంథని:హన్మకొండ జిల్లాలో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ నంది అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన కళాకారుడు కాసిపేట సంతోష్‌కుమార్‌కు మాజీ డెప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క, పలువురు చేతులమీదుగా నంది అవార్డు అందించారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర సర్కార్ చేపట్టిన కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని అంకంపల్లిలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమం పరిశీలించి ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారందరికీ కంటి అద్దాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవి, ఎంపీటీసీ సంపత్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

ధర నిర్ణయించి.. రైతును ఏమార్చి..!

- ఇదో కొత్తరకం మోసం..!
- తెల్లబోయిన పత్తి రైతు


ఈ ఫొటోలో ఉన్న రైతు ఎలకుచ్చి వెంకన్న. మంథని మండలం కాకర్లపల్లి. దాదాపు 12 క్వింటాళ్ల పత్తిని పెద్దపల్లి మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చాడు. ఈనామ్ పద్ధతిన కమాన్‌పూర్ మండలం గొల్లపల్లిలోని పరమేశ్వర జిన్నింగ్ మిల్లు (లాట్ నంబరు 285) రూ.7,625కు క్వింటాల్ చొప్పున కొనుగోలు చేసింది. తీరా మిల్లుకు తరలించగా.. తేమ ఎక్కువగా ఉందని, క్వింటాల్‌కు రూ.7,200 మాత్రమే చెల్లిస్తామని, లేకుంటే తీసుకెళ్లు అని నిర్వాహకులు దబాయించారు. దీంతో సదరు రైతు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్‌కు ఫిర్యాదు చేశాడు.

పెద్దపల్లిరూరల్: అరకొర దిగుబడులతో అవస్థలు పడుతూ ఆశించిన ధర రాక ఆందోళన చెందుతున్న పత్తి రైతు వ్యాపారుల కొత్తరకం మోసంతో తెలబోతున్నాడు. పత్తి కొనుగోళ్లు మొదలైన రోజున క్వింటాల్‌కు రూ.9వేలు పలికిన పత్తి ఇపుడు రూ.8వేలకు మించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.


మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు

ఎంతకైనా అమ్ముకుంటారనేనా..?

ఈ నామ్ పద్ధతిన కొనుగోలు చేస్తున్న ఖరీదుదారులు పత్తి నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తారు. మార్కెట్‌లో ధర నిర్ణయం జరిగాక పత్తి దిగుబడిని అన్‌లోడ్ చేసుకోవాలి. సోమవారం ఓ రైతు నుంచి పత్తిని కొన్న మిల్లు నిర్వాహకులు క్వింటాల్‌కు రూ.400కు పైగా ధర తగ్గించడంతో ఏం చేయాలో తెలియక తిరిగి మార్కెట్‌యార్డుకు చేరుకుని అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కొనుగోలు సమయంలో ధరలో పోటీపడిన మరో వ్యాపారిని సంప్రదించి రూ.7,621 చెల్లించారు. ధరలో మోసం చేసిన ఖరీదుదారుపై చర్యలు తీసుకోవాలని రైతు మార్కెట్ శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పత్తి రైతు వెంకన్న నుంచి ఫిర్యాదు అందిందని, మంగళవారం విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నాయకులు

రామగిరి: ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య ప్రారంభించారు. నిరుపేద విద్యార్థుల సౌకర్యం కోసం ప్రతీ ఏడాది ట్రస్ట్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుదాటి రవిందర్ రావు, రైతు బంధు మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్, సర్పంచ్ మేడగోని సతీశ్, నాయకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆకలి తీర్చడమే ట్రస్టు ముఖ్య లక్ష్యం

మంథని: పేద విద్యార్థుల ఆకలి తీర్చడమే పుట్ట లింగమ్మ ట్రస్టు ముఖ్య లక్ష్యమని మంథని ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. సోమవారం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు తగరం సుమలత, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం విద్యార్థులు ఉన్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకే క్రికెట్ టోర్నీ


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రశాంత్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకు క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు దాసరి ప్రశాంత్ రెడ్డి, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, టీషర్టు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజవర్ధన్, సర్పంచు ఆడెపు శ్రీదేవి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, రైతుసమన్వయ సమితి మండల కన్వీనర్ దేవయ్య, రాంచంద్రా రెడ్డి, క్రీడాకారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు కేసీఆర్ క్రికెట్‌కప్ పోటీలు ప్రారంభం

ఓదెల: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఓదెలలో కేసీఆర్ క్రికెట్ కప్ పోటీలను పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నేడు ప్రారంభిస్తారని బీఆర్ఎస్ పార్టీమండల యూత్ అధ్యక్షుడు మ్యాడగొని శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులను, క్రీడాసామగ్రి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

మండల పరిషత్ కార్యాలయంలో 57 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేస్తారని తహసీల్దార్ కె రమేశ్ తెలిపారు.

ఇన్‌స్పైర్ ప్రదర్శనల్లో ప్రతిభ కనబర్చాలి: కలెక్టర్


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని కలెక్టర్ సంగీత తెలిపారు. ఇటీవల నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన హర్షిత, గత నెల నాగపూర్‌లో 108వ జాతీయసైన్స్ కాంగ్రెస్, అహ్మదాబాద్‌లో జరిగిన బాలల సైన్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. డీఈఓ మాధవి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, హెచ్ఎంలు శ్రీనివాస్, నరేశ్ తదితరులున్నారు.

గ్రంథాలయాలకు సొంత భవనాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గ్రంథాలయాలకు సొంతభవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ అన్నారు. సంస్థ పాలకమండలి సమావేశంలో వార్షికబడ్జెట్ తీర్మానాన్ని ఆమోదించారు. కమాన్‌పూర్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల గ్రంథాలయాలకు సొంతభవనాలకు అవసరమైన స్థలాన్ని కలెక్టర్ కేటాయించినట్లు తెలిపారు. రూ.25 లక్షలతో పుస్తకాలు తెప్పించి అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో డీఎల్‌పీఓ వేణుగోపాల్, ఎంఈఓ సురేందర్‌కుమార్, డైరెక్టర్లు గట్టయ్యతో పాటు శ్రీనివాస్, సరిత, స్వరూప తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

సంత్ రవిదాస్ జయంతి

పెద్దపల్లిరూరల్: బీజేపీ దళితమోర్చా ఆధ్వర్యంలో సోమవారం సంత్ రవిదాస్ జయంతి పెద్దపల్లిలో నిర్వహించారు. జిల్లా దళితమోర్చా అధ్యక్షుడు ప్రభాకర్, పల్లె సదానందంతో పాటు ఇన్‌చార్జీ బాల్‌రెడ్డి సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పర్శ సమ్మయ్య, నాయకులు శ్రీనివాసరావు, క్రాంతి, రవీందర్, ఫహీం, రమేశ్, మల్లారెడ్డి, సందీప్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సాలో వర్క్‌షాప్

పెద్దపల్లిరూరల్: మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం టాస్క్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఒరాకిల్ జావా ఫౌండేషన్ పై వర్క్ షాప్ మొదలైంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అధునాతన సాంకేతికతపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని, పోటీల్లో ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి ఉద్యోగావకాశాలను దక్కించుకునేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని కళాశాల చైర్మన్ ఎడవల్లి నవీన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రేనర్ ప్రణయ్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు

కమాన్‌పూర్: మరణానంతరం నేత్రాల దానంతో అంధుల్లో జీవితాల్లో వెలుగులు నింపవచ్చని సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీ.హెచ్ లింగమూర్తి అన్నారు. మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన ఇరుగురాల్ల రాజమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, రాజమల్లు కళ్లను కుటుంబ సభ్యులను దానం చేయగా సోమవారం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులకు అభినందన పత్రాన్ని అందజేశారు.

దుబ్బుల వృత్తిదారులను కళాకారులుగా గుర్తించాలి

సుల్తానాబాద్: దుబ్బుల వృతిదారులను రాష్ట్ర ప్రభుత్వం కళాకారులుగా గుర్తించాలని దుబ్బుల వృతిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాటూరి దేవేందర్ అన్నారు. పట్టణంలోని అశోక్‌నగర్‌లో దుబ్బుల కళాకారుల సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వృత్తిదారులకు సంక్షేమ పథకాలు అందించాలని ముఖ్య సలహాదారుడు బాలకృష్ణ పేర్కొన్నారు. ఏప్రిల్ 3న ఢిల్లీలో 'ఢిల్లీపై దుబ్బుల లొల్లి' కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జనగిరి దుర్గయ్య, కోశాధికారి సదానందం, జిల్లా అధ్యక్షుడు గిడుగుల సమ్మయ్య దుబ్బుల కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాట్య మయూరి పురస్కారం

కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాట్య మయూర పురస్కారాలు అందజేశారు. ఈ నెల 1న మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య కళా మహోత్సవంలో గుండారం పాఠశాలకు చెందిన రాగచంద్రిక, టీ.సాహితీ, డీ.సహస్ర, పీ.అక్షిత నాట్య ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచి పురస్కారాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల ఓదెలు, ఎంఈవో పల్లెపాటి సంపత్ రావు, ఎంపీడీవో విజయ్‌కుమార్, పాఠశాల హెచ్ఎం. గోపాల్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


పట్టణంలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రాచకొండ గిరిబాబు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. వసతిగృహాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవని, ఆహారంలో కల్తీ జరిగి అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. నాయకులు అజయ్, రంజిత్, మనిషా, సందీప్, నాగచంద్ర, బండి రాజశేఖర్, నితిన్, సిద్దార్థ తదితరులున్నారు.